# శమంతకమణికోసం



పి. నరసింగరావు

గోదావరి లంక పొగాకు చుట్ట ఘాటుగా పీలుస్తూ "ఇదికాకపోతే మరొకటి. అంతకంటె గొప్పవాళ్ళు అన్నదానికల్లా ఒప్పుకుని చేసివ్వడానికి మనవాడికి ఏం తక్కువే! రాజాలాటి సంబంధం వస్తుంది" అన్నారు ఒక చేత్తో మీసం మెలివేస్తూ, వాలు కుర్చీలో కూర్చున్న రిటైర్డు తాసిల్దారు వెంకట్రామయ్యగారు.

"వస్తే రావొచ్చు. కాని అబ్బాయి మాత్రం ఆ అమ్మాయిని తప్ప మరొకరిని పెళ్ళిచేసుకోనంటున్నాడు' అంది సుందరమ్మ పమిటకొంగుతో తడిచేతులు తుడుచుకుంటూ.

'ఏడిశాడు వెధవాయి. పెళ్ళికూతురును చూసేసరికి ఇలా ఐస్‌క్రీంలా కరిగిపోతే ఎలా? కావాలంటే ఆ అమ్మాయిని తలదన్నే వాళ్ళను తీసుకువస్తా".

"మీరు ఎన్ని చెప్పండి. ఆ అమ్మాయికి ఎవరూ సాటిరారు. సాక్షాత్తూ లక్ష్మీదేవిలా ఉంది. ఆరోగ్యం, అందం, వాటికి తగ్గగుణం! పైగా ఇంటర్ చదువుతూంది. మా పింతల్లి కూతురు చెప్పినట్లు అలాంటి అమ్మాయిని కోడలుగా పొందాలంటే పూర్వజన్మసుకృతం ఉండాలి"

"అబ్బ కట్టిపెడుదూ నీ ధ్రటాజా పొగడ్తలు! వయస్సొస్తే కాకిపిల్ల కూడా అందంగానే ఉంటుంది. ఇంతకూ నచ్చితేసరి ఆకాశానికి ఎత్తివేయడం, లేకపోతే పాతాళానికి అణచివేయడం నీకు ఉన్నదేగా!

"ఏమో బాబూ ఏమైనా అనండి. మీతో వాదించడం నాతరం కాదు. కాని కట్నం కోసం అంతపట్టుదల దేనికి? మనకేం లేదా కాదా! మా పుణ్యం ఉంటుంది. ఈ సంబంధం మాత్రం కాదనకండి" అంది సుందరమ్మ భర్తను ప్రాధేయపడుతూ.

"ఆ...ఆ... నీ సిఫార్సు తక్కువేందనే ఆలోచిస్తున్నా. వెధవది అన్నిటికీ తొందరే! వాడికన్నా మన్యా నీగోలే ఎక్కువగా ఉంది" అంటూ విసుక్కుని వెంకట్రామయ్యగారు లేచి, దండెం మీద కండువా తీసి భుజాన వేసుకుని, చేతికర్ర విలాసంగా త్రిప్పుకుంటూ షికారుకు వెళ్ళిపోయారు

భర్త వెళ్ళిన వంకే అయోమయంగా చూస్తూ సుందరమ్మ కుర్చీలో కూలబడింది.

* * *

సత్యనారాయణ వెంకట్రామయ్యగారి ఏకైకపుత్రుడు. బి. ఏ. పాసై కలకత్తాలో రైల్వే ఉద్యోగం చేస్తున్నాడు. పాతికేళ్ళు నిండనందువల్ల అతని పెళ్ళికి తల్లిదండ్రులు తొందరపడుతున్నారు. అతనూ వివాహానికి సుముఖంగానే ఉన్నాడు. నాలుగైదు సంబంధాలు మాట్లాడటం జరిగింది కాని ఏదీ కుదరలేదు. సత్యానికి కావలసినది, అమ్మాయి ఆరోగ్యం. రూపం, గుణం! వెంకట్రామయ్యగారికి కావలసింది, ఘనమైన కట్నం, లాంఛనాలు, వంశం, కులం గోత్రం వగైరా వగైరాలు. ఈ విభిన్న దృక్పథాల మధ్య పొత్తు కుదరలేదు. ఇలా ఉండగా విశాఖపట్నంలో ఎవరో దూరబ్బంధువుల ద్వారా సత్యానికి మంచి సంబంధం వచ్చింది. టెలిగ్రాం ఇచ్చి సత్యాన్ని పిలిపించారు. వచ్చాడు. పెద్దల సమక్షంలో పెళ్ళిచూపులు లాంఛనప్రాయంగా జరిగాయి. వధూవరుల ఈడూ జోడూ బాగుందని ఉభయపక్షాలు తీర్మానించారు

వెంకట్రామయ్యగారు భార్యతో సహా తిరుగు రైల్లో స్వస్థలానికి ప్రయాణమయ్యారు. సత్యం మాత్రం ఆ దినం ఆ మర్నాడు తన స్నేహితులవద్ద గడుపుదామనే తలంపుతో ఆ ఊరిలోనే ఉండిపోయాడు. ఆ మర్నాడు అనుకోకుండా, కాలేజీ వద్ద ఒకసారి, సాయంత్రం సినీమాహాలువద్ద మరొకసారి సత్యం మళ్ళీ ఆ అమ్మాయిని చూడటం తటస్థపడింది. దాంతో ఆమె రూపం అతని హృదయఫలకంమీద గాఢంగా ముద్రింపబడింది. చంద్రబింబంలాంటి ఆమె వదనం, ఆ లేత పెదవులపై తొణికిసలాడే వెన్నెల వెలుగువంటి చిరునవ్వు, మంచిముత్యాలను వెక్కిరించే తీరైన పలువరుస, విశాలమైన కళ్లూ. సూక్ష్మబుద్ధిని తెలియజేసే సూది ముక్కు, పిరుదులవరకూ వేలాడే అందమైన జడా అతన్ని ఎంతగానో ఆకర్షించాయి. కథానాయికలో ఉండవలసిన లక్షణాలన్నీ ఆమెలో మూర్తీభవించాయని గర్వపడ్డాడు. అందులో తనని చూసి గుర్తించి, ముసిసిగ్గుతో చూపులు మళ్ళించుకుని, తల వంచుకుని క్షణకాలం అచేతనంగా నిల్చున్న ఆమె సుకుమార సుందర స్వరూపం అతని కన్నులకు ప్రతిక్షణం జ్ఞాపకంవచ్చి వేధిస్తూంది.

ఏ జన్మలో చేసుకున్న సుకృతంవల్లనో 'శమంతకమణి' అని పిలువబడే ఆ అందాలరాశి, అపరంజిబొమ్మ తన అర్ధాంగి కాబోతూందని మురిసిపోయాడు! తన అదృష్టాన్ని తానే అభినందించుకున్నాడు. తన ఆశయాలకు, ఆశలకు తగ్గ అమ్మాయి లభించిందని అమితంగా సంతోషపడ్డాడు. ఎన్నో తియ్యటి కలలు కన్నాడు. ఏవేవో ఊహా

# ★ శమంతకమణి కోసం ★

గానాలు చేసేడు.

కాని ఏం ప్రయోజనం? 'దేముడు వర మిచ్చినా పూజారి వరమివ్వడన్నట్లు వెంక ట్రామయ్యగారు తాము అడిగినదానికి ఒక్క కానీ తక్కువైతే పనికిరాదన్నారు. తనకు అమ్మాయి బాగా నచ్చిందని తెలిసికూడా కట్నం విషయంలో తండ్రి అంత ఖండి తంగా నిర్మొహమాటంగా వ్యవహరించేసరికి సత్యం చాలా బాధపడ్డాడు. అసలు అతనికి అదొక విద్యుద్ఘాతం! పట్టరాని కోపం వచ్చింది. తండ్రిని ధిక్కరించైనా ఆమెనే పెండ్లి చేసుకుందామనుకున్నాడు. కాని వెంకట్రామయ్యగారు ఎంత కోపిష్టి, మొండి పట్టుదల గలవారో, సత్యం అంత శాంతం, ధారాళబుద్ధి కలవాడు. అంతేకాక లౌకిక జ్ఞానం తెలిసిన వివేకవంతుడు. తొందరపడి తండ్రితో తెగతెంపులు చేసుకుంటేమాత్రం ఏం ప్రయోజనం? ఆడపెళ్ళివారికి తనపై దురభిప్రాయం ఏర్పడవచ్చు. అంతేకాక శుభకార్యానికి ముందు అలాంటి తీవ్రమైన తగవులూ, మనస్పర్ధలు, అశుభానికి, అసౌఖ్యానికి దారితీయవచ్చు. పైగా నలుగురిలో తలవంపులు, ఈ వృద్ధాప్యంలో అమాయకురాలైన మాతృమూర్తికి తీరని అశాంతి!

అంచేత ఇవన్నీ నిదానంగా ఆలోచించి, కాస్త ఆలస్యమైనా, ఈ విషయాలన్నీ శాంతియుతంగానే పరిష్కారమై ఉభయుల పెద్దల అంగీకారంతోనే తను వివాహం జరుపుకుంటే అన్నివిధాలా మంచిదనే అభిప్రాయానికి వచ్చేడు.

* * *

"ఏరా సత్యం మొన్న విశాఖపట్నంవెళ్ళి చూసుకొచ్చిన సంబంధమైనా స్థిరపడిందా లేదా?" అన్నాడు సత్యం మేనమామ గోపాలం.

గోపాలం వయస్సులో పెద్దవాడైనా అతనిలో ఇంకా కుర్రతనం పోలేదు. చాలా ఉషారుగా ఉంటాడు. పైగా సత్యం అంటే ఎంతో అభిమానం.

మామయ్య అడిగిన ప్రశ్నకు "లేదు. నాన్న ఇష్టపడలేదు" అని నిరుత్సాహంగా జవాబిచ్చేడు సత్యం.

"అదేమిటిరా! ఆ అమ్మాయి ఫోటోలో అంత బాగుందే! ఇంతకూ చేసుకునేది నువ్వా, మీ నాన్నా?"

"అదే మావయ్యా అర్థంకాక చస్తున్నా"

"అసలు ఇంతకూ మీ నాన్నకు నచ్చక పోవడానికి కారణం?"

"ఆ... వేరే ఏముంది? కట్నం చాలదనే. వాళ్ళు రెండు వేలు చూపించేరు. నాన్న అలా పనికిరాదని ఐదు వేలు చూపించేరు. వాళ్ళు అంత తూగలేమన్నారు. దాంతో అంతా పుసిగిపోయింది."

"ఎంతగడించి పోగుచేసినా మీ నాన్నకు ఇంకా డబ్బుమీద వ్యామోహం పోలేదురా! ఇంతకూ నాకే, నీకు ఈడైన పిల్ల ఉండి ఉంటే, మీ నాన్నను మూడు చెరువుల నీళ్లూ తాగించి రోగం కుదిర్చేవాణ్ణి కాని ఏం లాభం?"

"ఏంచెయ్యడం మామయ్యా. అయినసరి అంతే. వస్తా నాకు టైము అయింది. ఇంకా ఇంటికివెళ్లి పెట్టే బేడా పట్టుకుని స్టేషన్‌కు పోవాలి" అన్నాడు సత్యం వాచీ చూసుకుంటూ.

అంతలో 'ఏమోయ్ సత్యం! అయితే మళ్ళీ దసరాలకేనా రావడం?' అని అత్తయ్య అడిగిన ప్రశ్నకు 'ఆ' అని ముక్తసరిగా జవాబుచెప్పి, పిల చేతిలో ఓ పది రూపాయిలు పెట్టి హడావుడిగా బయటపడ్డాడు.

సత్యం కలకత్తా తిరిగివచ్చి యథావిధిగా ఆఫీసుకు వెళ్తున్నాడన్నమాటే గాని అతని మనస్సుమాత్రం అక్కడ లేదు. రోజులు చాలా నిరుత్సాహంగా, భారంగా గడుస్తున్నాయి. అతనికి పట్టుకున్న బాధల్లా, తన కుటుంబంలో ఏ కలతలూ, కలహాలూ రాకుండా 'శమంతకమణిని' ఎలా తనదాన్ని చేసుకోవడమన్నదే. నిజానికి అంతవరకూ, ఎన్నడూ ఏ విషయంలోనూ తండ్రిని ఎదిరించలేదు. సర్వీసు పోవడంనుంచి చాలా సాఫీగానే గడిచింది. ఒకవేళ వివాహ సందర్భంలో మాత్రం తను తండ్రిని తొందరపడి ఎదిరిస్తేమాత్రం ఏం ప్రయోజనం? ఏమైనా ఎదిరించడానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. ఇక ఈ విషయం మంచిగా ఎలా సాధించాలో ఎంత కొట్టుకున్నా అతనికి ఉపాయమేది తట్టలేదు.

కాని బాగా ఆలోచించిన తరువాత ఎందుకైనా మంచిదని తాను ఆమెనే తప్పక వివాహం చేసుకుంటానని, కొద్దినెలలు నిరీక్షిస్తే ఈలోగా తన తండ్రి మనస్సు మారుతుందని శమంతకమణి పెద్దలకు ఒక జాబురాసి పడేశాడు. వాళ్లకు కూడా, సత్యం అన్ని విధాలా నచ్చడంనుంచి అనుకూలమైన జవాబేరాసేరు. దాంతో సత్యం కొంత స్తిమితపడ్డాడు.

* * *

సత్యం కలకత్తాలో ఎవరిఇంట్లో అద్దెకు ఉంటున్నాడో ఆయనకూడా సత్యం పని చేస్తున్న ఆఫీసులోనే పనిచేస్తున్నారు. ఆయనకు మగపిల్లలు లేకపోయినా ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. వాళ్లిద్దరూ అక్కడే ఇంటర్ చదువుతున్నారు. సత్యం ప్రవర్తన ఆ పెద్దమనిషికి బాగా నచ్చడం నుంచీ, దానికితోడు సత్యం తనకంటె వయస్సులో బాగా చిన్నవాడవడంనుంచీ స్వంత కొడుకులా ఎంతో అభిమానంగా చూసుకుంటున్నాడు. కొద్దికాలంలోనే సత్యం ఆ బెంగాలీ కుటుంబానికి ఆత్మీయుడయ్యాడు. ఇక ఆ ఇద్దరు అమ్మాయిలు కూడా సత్యాన్ని తమ తోబుట్టువులా భావించి చాలా చనువుగా మసలుకుంటున్నారు.


ఆయుర్వేదౌషధములు.

శాస్త్రీయముగాను, నమ్మకముగాను తయారుచేయు సంస్థ.

వేంకటేశ్వర ఆయుర్వేదనిలయం.

చింతలూరు.

ఆలమూరు పోస్టు ★ తూర్పుగోదావరిజిల్లా.

ఆంధ్రదేశమందంతటను బ్రాంచీలు, ఏజన్సీలు కలవు.

హైదరాబాదు బ్రాంచి: 712, సెంట్రల్ బ్యాంక్ బిల్డింగ్స్.
సికింద్రాబాదు బ్రాంచి: 7-2-148 హిస్సాముగంజి పాత పోలీసుస్టేషను ఎదుట.

ఆశగా ఆత్రుతగా ఎదురుచూసిన దసరా దగ్గరపడింది. సెలవులు వృధాపోకుండా వాటికి తోడు మరో పదిహేనురోజులు ముందుగానే సెలవుతీసుకుని ముసలాయన సకుటుంబంగా దక్షిణదేశయాత్ర చెయ్యాలని ఏర్పాట్లు చేసుకున్నాడు. సత్యంకూడా వాళ్లతోనే ప్రయాణం స్థిరపరచుకున్నాడు. అంతేకాక ముసలాయనను సకుటుంబంగా తోవలోనే ఉన్న తమ ఊళ్లోదిగి నాలుగు రోజులు తమ ఆతిథ్యం స్వీకరించమని బలవంతపెట్టేడు.

వాళ్లు కాదనలేక దిగేరు. 'అంతచిన్న ఊళ్లో చూడ్డానికి ఏముంది? ఈ నాలుగు రోజులు హాయిగా విశ్రాంతి తీసుకుంటాం' అని వృద్ధదంపతులు ఎటూ అంత తిరక్కపోయినా, ఆ ఇద్దరు అమ్మాయిలూ మాత్రం, ఊళ్లో చూడవలసిన ప్రదేశాలన్నీ సత్యంతో యధేచ్ఛగా, ఉత్సాహంగా వెళ్లి చూస్తున్నారు. ఒకటి రెండు తెలుగుసినీమాలకు కూడా వెళ్లేరు. ఇక ఇంట్లో ఉన్నప్పుడు కూడా సంగీతం, సాహిత్యం, లలితకళలు, ఆచార వ్యవహారాలు, అలాంటివి ఒకరివి ఒకరు తెలుసుకుంటున్నారు. బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఆ ముసలి దంపతులు కూడా మధ్య మధ్య వాదనలలో పాలుపంచుకుంటున్నారు.

వాళ్లు మాట్లాడుకుంటున్నది బెంగాలీలోనో ఇంగ్లీషులోనో కావడంవల్ల సుందరమ్మకు ఏమీ బోధపడకపోయినా, వాళ్ల ఉత్సాహం, కలుపుగోలుతనం చూసి మెచ్చుకుంది. సుందరమ్మ చదువుకోకపోయినా చాలా విశాలభావాలు కలది. అంతేకాకుండా సత్యంవలన ఇదివరలో అనేక సార్లు ఆ బెంగాలీకుటుంబం మంచితనం గురించి విన్నదవడంవలన, వాళ్లను దగ్గర బంధువులకన్నా హెచ్చుగా ఆదరిస్తూంది. పని పాటల్లో ఆ అమ్మాయిలు సహాయం చెయ్యబోయినా వద్దని వారించింది.

ఇక ఎటొచ్చీ వెంకట్రామయ్యగారికి మాత్రం ఇదంతా అసౌకర్యంగా ఉంది. ఆయన చాలా సంకుచితభావాలు కలవారే కాక ఒట్టి అనుమానం మనిషి. దానికితోడు పెళ్లి కావలసిన సత్యం, ఎదిగిన పరాయి అమ్మాయిలతో అంతచనువుగా తిరగడం ఆయనకు చాలాకష్టమనిపించింది. పైకిగట్టిగా ఏమీ అనలేక లోలోనే మరింత బాధపడిపోతున్నారు. అందుకే అతిథులతో తనకేమీ సంబంధం లేనట్లు ముభావంగా గడుపుతున్నారు.

ఆ సాయంత్రం ఒక్క వెంకట్రామయ్యగారు తప్ప మిగిలిన అందరూ కలిసి ఆవూరికి మూడుమైళ్ళ దూరంలోఉన్న శివాలయం చూడడానికి వెళ్ళేరు

# భావముక్తాలు

సెలయేటి జవరాలి
జలవేణి సరులలో
లలితగంధము లీను
కలువ పువ్వమ్మునై
మొలిచితేనో!

సింగొమ్మగుమురులో
కలకలార్భటితోడ
వలపుం బాటలు పాడు
పులుగు చిన్నారినై
పుట్టితేనో!

ఆకాశ వీధిలో
అభిరామ కాంతితో
ఆసేను త్రేను వంటి
అందాల చుక్కనై
అమరితేనో!

జలదమార్గమ్ములో
చలి వెల్లువాపులో
మిలమిలా మెరిసేటి
తెలిమబ్బు తునకనై
నిలిచితేనో!

—వి. పురుషోత్తం

వెంకట్రామయ్యగారుఒంటరిగాకూర్చొని తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

అంతలో గోపాలంవచ్చి "ఏమిటోయ్ బావా! మనసత్యం రాత్రీ పగలూ అనక ఎదిగిన ఆ ఇద్దరు బెంగాలీ అమ్మాయిలను వెంటబెట్టుకుని తెగ తిప్పేస్తున్నాడు" అన్నాడు తన మామూలు హాస్య ధోరణిలో.

'అదేనోయ్ నేనూ తీవ్రంగా ఆలోచిస్తున్నా! మనకళ్లముందే ఇంత నిర్భయంగా విచ్చలవిడిగా తిరుగుతూంటే ఇక ఆ కలకత్తాలో ఏం అఘోరిస్తున్నారో చూశామా ఏడిశామా?" అన్నారు బాధగా.

గోపాలం పైకి హాస్యధోరణిలో తేలిగ్గా మాట్లాడే రకంలా కనుపించినా చాలాలోతు గుండెమనిషి. దానికితోడు అఖండమైన తెలివితేటలు, లౌకికజ్ఞానం ఉన్నాయి. అందుకే అంతకుముందే సత్యం వలన ఆ బెంగాలీ కుటుంబంగురించి పూర్తిగా విన్నా, తనకేమీ తెలియనట్లు, తనకూ ఏదో అనుమానమున్నట్లు "అయితే ఇంకా వాళ్ళు ఎంతకాలం ఇక్కడ తిష్ఠవేస్తారు." అన్నాడు అమాయకంగా.

"ఈ శనివారందాకా. ఆ తరువాత మద్రాసీ, మధుర, రామేశ్వరం వెళతారట. వాళ్ళతో తోకలా మనవాడూ తయారౌతున్నాడు."

"పోనీవెళ్ళనీ వాడికేం పాస్ ఉంటే ఉంది, వాళ్ళతోబాటే నాలుగూళ్లు తిరిగి వస్తాడు."

"ఎద్దుపుండు కాకికేం తెలుసు అన్నట్లు నీకేం వెళ్లమంటావు. నామట్టుకు వీడివాలకం వ్యవహారం చూస్తూఉంటే, కొసకు మనకు దక్కకుండా పోతాడేమో అని భయంపట్టుకుంది" అంటూ ఆపైన కొడుకు విషయంలో తనకు ఇటీవల ఏర్పడిన అనుమానాలన్నీ బావమరిది చెవులో వేసేరు.

గోపాలం అంతా ఓపిగ్గా విని, ఆయన అన్నదానికల్లా ఔనంటూ, కొసకు "నిజమేనోయ్ బావా. మునుపటి రోజులు కావు. నువ్వు చెప్పినట్లు జాగ్రత్త పడవలసిందే! వాడురాగానే నావద్దకుపంపు. నేర్పుగా బుజ్జగించి వాడిచేతే విషయం వెళ్లకక్కిస్తా. నువ్వుమాత్రం తొందరపడి ఈ విషయంలో సలదిస్తే అడిగేవో అంతా చెడిపోతుంది సుమా" అని బావగారిని హెచ్చరించి బయటపడ్డాడు.

* * *

"ఏంమామయ్యా అర్జంటుగా రమ్మన్నావుట" అన్నాడు సత్యం ఆత్రుతగా గుమ్మంలో అడుగుపెడుతూనే.

"రా...రా...మేడమీదకు వెళ్ళి మాట్లాడుకుందాం" అని గోపాలం అతన్ని మేడమీదకు తీసుకువెళ్ళి "అబ్బే మరేం లేదురా నువ్వు ఆ అమ్మాయిలతో మరీ చనువుగా తిరుగుతున్నావని మీ నాన్న నొచ్చుకుంటున్నాడు" అన్నాడు.

దాంతో సత్యానికి ఒళ్ళు మండింది. "అన్నీ తెలిసిఉండికూడా నువ్వు ఇలా అంటే ఏంచెప్పేది?" అన్నాడు తీక్షణంగా.

"అబ్బ నాకు నమ్మకంలేక కాదురా. మీ నాన్నే తల్లకిందులై పోతున్నాడు"

"అయితే అవనీ, నాకేం! పాపం వాళ్లు వచ్చి రెండురోజులైందో లేదో అప్పుడే అవమానాలూ! అపనిందలూ! అసలు ఈ 'అనుమానం' అనే జబ్బున్న వ్యక్తులు అంతా ఇంతే! ఆఖరికి అన్నాచెల్లెలూ సరదాగా కలిసి తిరుగుతున్నా, ఏవేవో ఊహాగానాలతో చిలవలూ పలవలూ కల్పించి

# ★ శమంతకమణి కోసం ★

ప్రచారం చేస్తారు. ఛీ...ఛీ..." అన్నాడు బావగా.

"ఇంత స్వల్ప విషయానికి అంతబాధపడ తావెందుకురా? ఇంతకూ ఆ విశాఖపట్నం సంబంధంగురించి ఏం ఆలోచించావ్? నీ మనస్సులోనిమాట చెప్పాలిసుమా"

"నీదగ్గర దాపరిక మేముంది మామా. నేను ఆ అమ్మాయినితప్ప మరొకరిని వివాహం చేసుకోదలచుకో లేదు. ఇక తను అన్నదానికి కానీ తక్కువైతే నాన్నగారు ఆ సంబంధానికి ఒప్పుకోరు. వాళ్ళుఅంత ఎలాగూ ఇచ్చుకో లేరు. అందుకే తాడో పేడో తేల్చుకుందామనుకుంటున్నా. కాని ఏమీపాలు పోవటం లేదు"

"అయితే నువ్వు ఇప్పుడు వాళ్ళతోపాటు మద్రాసు వెళ్తావా?"

"అవునే వాళ్ళు బలవంతపెడుతున్నారు కాని, నాకు అసలు వెళ్ళాలనిలేదు"

"సరేఅయితే నీపెళ్ళి సమస్య గోళ్ళతో మీటేస్తా నాకేంఇస్తావు?"

"అది నువ్వనుకుంత తేలిక కాదు మావయ్యా"

"అబ్బ ఒకవేళ సాధించానే అనుకో"

"అంతకన్నా నా! ఉభయపక్షాల అంగీకారంతో నువ్వీసమస్యను పరిష్కరించ గలిగితే నువ్వు ఏం అడిగినా ఇస్తా. అంతే కాక జీవితాంతం నీకు ఋణపడి ఉంటా."

"సరే నాకేమీ ఇవ్వక్కర లేదులే కాని నేను చెప్పినట్లు నువ్వు అంతా చెయ్యాలి"

'ఓ' అని సత్యం ఉషారుగా అంగీకరించడంతో ఇద్దరూ చాలాసేపు ఏకాంతంలో మాట్లాడుకున్నారు.

* * *

ఎవరైతే తామే అతితెలివైన వాళ్ళమనే అహం భావంతో విర్రవీగుతూ ఉంటారో అలాంటివాళ్ళే తేలిగ్గా బుట్టలో పడతారు. ఎవరు ఉచితం. అనుచితం అన్న విచక్షణలేకుండా, మొండి పట్టుదలతో మూర్ఖంగా ప్రవర్తిస్తారో అలాంటివాళ్ళను, ఒక్కొక్కప్పుడు 'పరిస్థితులు' 'విధి' ఆ పట్టు వదలి తలవంచుకు నేటట్టు చేస్తాయి. లేదా నిర్దాక్షిణ్యంగా నాశనంచేస్తాయి.

వెంకట్రామయ్యగారి విషయంలో సరిగ్గా అలాగే జరిగింది.

ఆ ఉదయం, అయినా, గోపాలం చాలా సేపు తర్జనభర్జనలు చేసినతరువాత ఒక నిర్ణయానికివచ్చి, సత్యాన్ని పిలిచి "నువ్వు వాళ్ళతో ఇప్పట్లో వెళ్ళ డానికి వీలుపడదు. రాజమండ్రి పెళ్ళిచూపులకు వెళ్ళాలి" అన్నారు. దాంతో సత్యం మండిపడుతూ, "ఈ పెళ్ళిచూపులు అంటూ అన్నదిలేదా? నాకు పెళ్ళీ ఒద్దు గిళ్ళీవద్దు" వాళ్ళతో వెళ్ళితీరాలి" అన్నాడు.

తండ్రీకొడుకులమధ్య చాలాసేపు ఘర్షణ జరిగింది.

బావమరిదిని వెనకేసుకుని గోపాలం, మేనల్లుడికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. కాని సత్యం కొండఎక్కి కూర్చున్నాడు.

ఇదివరల్లో తనముందు మాట్లాడడానికే జంకేకొడుకు, ఎదురుతిరిగి 'వినాల త్యం నాకేం' అన్న ధోరణిలో మాట్లాడే సరికి వెంకట్రామయ్యగారు తల్లకిందులయ్యారు. పాపం అప్పటికిగాని తనది మేకపోతు గాంభీర్యమని ఆయనగుర్తించలేదు.

అయినా ఇంకా కొస్తనింకంగా, "అయితే ఏ బెంగాలీ అమ్మాయినో చేసుకుంటానందూ" అన్నాడు హేళనగా తనకడుపులోని అక్కసు వెళ్ళగక్కుతూ.

"ఆ...అవసరమనిపిస్తే నిక్షేపంలా చేసుకుంటా. ఏంతప్పా?" అని తండ్రిని నిలదీసి అడిగేడు.

దాంతో వెంకట్రామయ్యగారి కాళ్ళూ చేతులూ చల్లబడ్డాయి. కొడుకును శాంతపరుద్దామని సుందరమ్మ ఎంత ప్రయత్నించినా వ్యర్థమైంది, పాపం! ఆ బెంగాలీ కుటుంబమంతా, తండ్రీ కొడుకులమధ్య ఘర్షణ దేనికి జరుగుతూందో అర్థమవక పతిమతి మాతున్నారు.

ఇంకా ఊరుకుని బాగుండదని, గోపాలం, బావగారిని దూరంగా తీసుకువెళ్ళి "ఇక ఉపేక్షించి లాభంలేదు. ముందు విశాఖపట్నం వైరుచేసి వాళ్ళను పిలిపించి ముహూర్తం పెట్టించు. లేదా రేపు వాడు వాళ్ళతో ఉడాయిస్తాడు. పొంగిపొర్లుతున్న యౌవనం! ఆ తరువాత ఏంచేస్తాడో? ఏమౌతుందో? ఎవరికి తెలుసు?" అన్నాడు.

"ఆ సంబంధమాత్రం ఇప్పుడు చేసుకుంటాడని నమ్మకమేమిటి? ఇంతకూ వాళ్ళు ఐదు వేలు ఇవ్వలేరట."

"నీలాంటివాడే చనూషంలో సంధి మంత్రం అన్నట్టు ముష్టిమూడు వేలకోసం నిక్షేపంలాంటి కొడుకుని కాకుండా చేసు

(62-వ పేజీ చూడండి)




సర్కార్లు & రాయలసీమలకు సోల్ ఏజెంట్లు:
మెసర్సు: ఆక్మీ ట్రేడ్ ఏజెన్సీస్, విజయవాడ-1

## ★ శమంతకమణికోసం

12-వ పేజీ తరువాయి)

వుంటావులెయ్యా! ఇంతకూ ముహూర్తం అంటూ సరపడితే వాడు చేసేదేమిటి! వెలుగుతుంటే బలవంతంగానైనా వాడిచేత ఆ పిల్ల మెడలో మూడుముళ్లూ వేయిస్తాం" అని వాలుగూ ఘాటుగా అంటించి వాడలు లోకెళ్లారు.

దాంతో వెంకట్రామయ్యగారికి తల తిరిగిపోయింది. నా కసలు లేకపోతే నేం 'శోకుకు ఎక్కి తేవాలి' అన్న తాపత్రయంలో పడ్డారు.

అంతే! వెంటనే శమంతకమణి పెద్దలను ఎక్స్‌ప్రెస్ వైరుచేసి పిలిపించడం వాళ్లు అన్న రెండువేలకీ ఒప్పుకోవడం, పదహేనురోజుల్లో ముహూర్తం ఏర్పాటవడం అన్నీ ఆ సాయంత్రానికి స్పష్టంగా జరిగిపోయాయి. అందుకే కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు!

వాతావరణం కొద్ది చల్లబడ్డ తరువాత సత్యం మేనమామ ఇదంతా తెలియక తెలబోతున్న ఆ బెంగాలీ కుటుంబానికి, 'తండ్రీ కొడుకులమధ్య ఘర్షణ మరేంకాదనీ, సత్యం పెళ్లి ఇప్పుడప్పుడే వద్దని పట్టు పట్టడం నుంచి అతన్ని ఒప్పించడానికే అంత గొడవ జరిగిందని' టూకీగా చెప్పేరు.

వాళ్లు మనస్సులు తేలికపడగానే మేకొక్క, పెళ్లికూతురు ఫోటో చూసి మెచ్చుకొని అందరూ ముదు ముద్దుగా సత్యాన్ని నాలుగు కేకలు వేశారు.

సత్యానికి ఇదంతా ఎవ్వలాటగా ఉన్నా పైకి బెట్టుగానూ, పెళ్లంటే విముఖుడుగా నటించేడు.

పెళ్లినాటికి తప్పక తిరిగివస్తామని ఆ బెంగాలీకుటుంబం అమర్నాథు వెళ్లిపోయారు. వెంకట్రామయ్యగారు కూడా వాళ్లను రమ్మని మరీ మరీ కోరేరు.

* * *

శోభవంగాలో సిగ్గుతో తలవొంచుకొని నిల్చున్న శమంతకమణిని సత్యం ఆప్యాయంగా ఆహ్వానించేడు కాని ఆమె సిగ్గుతో మరింత ముడుచుకుపోయింది. నిజానికి ఆమె కూడా మాట్లాడుదామనుకుంటూనే ఉంది. కాని నోరువిడితేగా! ఎలాగయితేనేం కొసకు మంచంమీద కూర్చుంది. కాని సత్యం ఆమెను మాట్లాడిద్దామని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

కొసకు యుక్తిగా "చూశావా! ఆనాడు శ్రీకృష్ణుడు ఎన్నో అవమానాలూ అపనిందలూ మోసి కష్టాలపాలై కొసకు శమంతకమణిని పొందేడు. మరి ఈనాడు ఈ శమంతకమణికోసం, మన పెళ్లికోసం, ఎంత నాటకం ఆడవలసి వచ్చిందో!" అని అంతవరకూ జరిగింది జరిగినట్టూ ఒక చిన్నకథలా తమాషాగా చెప్పేడు.

సత్యం కబుర్లన్నీ ఒప్పిగ్గా విన్న శమంతకమణి, మౌనంగానలి సిగ్గుతెరలు తొలగించుకుని చిరునవ్వుతో 'అయితే మీరు ఘటికులే' అంది. ★

## హైదరాబాదు విశేషాలు

(8-వ పేజీ తరువాయి)

మహేంద్రవరములో, నెల్లూరులో, కడపలో, ఇతరచోట్ల క్రమముగా ఆసుపత్రులు బాగుపడుతాయి. వెనకబడిన తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలు ముందుకు వచ్చేట్టు అవశ్యము కొత్త మంత్రివర్గము పని చేయాల్సింది. అయితే ముందుకువచ్చిన జిల్లాలు అనేచోట ఉన్నవి పూడ్చిపెట్టుకు పోయేదాకా ప్రభుత్వము చేతులుముడుచుకు కూర్చోవాలి అనే భావము కూడా మంచిది గాదు. ముందుకువచ్చిన జిల్లాలలో కూడా వెనకబడిన ప్రాంతాలు ఉన్నవి. వెనకబడిన ప్రాంతము ఎక్కడవున్నా క్రమముగా బాగుచేయాల్సిందే. కొన్ని ప్రాంతాలను నిర్లక్ష్యము చేశారు అనే భావానికి తావు ఇవ్వము అని కొత్త మంత్రులు కొందరు వారిప్రాంత ప్రజలకు హామీ ఇచ్చినదానిపై ఇంత గాలిగుమారము లేవడము అనవసరము.

—శర్మ. ★


నొప్పిని వెంటనే పోగొట్టుకోండి

స్లోన్స్ బామ్ వాడండి




• కీళ్లనొప్పులు • నడుమునొప్పి • బెణుకులకు